మందమతి మంగమ్మ

శ్రీమతి పింజమూరి వెంకటరత్నమ్మగారు

విశాఖపట్టణమునకు సమీపమున గోపాలపట్టణమను నొక పల్లె గలదు. అందు గోపరాజు వెంకటరాజుగారను నొక నియోగిబ్రాహ్మణుఁడు గలఁడు. అతఁ డొక బడిని పెట్టుకొని కొందఱు పిల్లలకు జదువు చెప్పుకొని వారిచ్చుజీతములతో జీవనము చేయుచుండెను. అతని కెల్లవిధముల ననుకూలయగు భార్య యుండెడిది. ఆమె హఠంబున మశూచిక వ్యాధిచే మృతినొందగా, వెంకటరాజున కింట వండిపెట్టువారు లేక, నాయనుబంధువులు లేక, కష్టముగానుండెను. అతనికి నలువదేండ్లు దాటియుండుటచేత, మరల పెండ్లాడునీడు తప్పినది. అదిగాక, యతనికి ధనసంపద మిగుల దక్కువగానుండుటచే, నెవ్వరును బిల్ల నియ్యకుండిరి. మరల నుద్వాహమాడవలెనని యతఁ డెన్నో విధముల బ్రయత్నించాడు. ఎందును సాధ్యము కాకుండెను. కాకినాడలో వితంతూద్వాహ సంఘ మొకటియుండఁగా, వారికి దన స్థితిగతులు తెలియజేసి తానొక వితంతువును బరిణయమాడ గోరుచుంటినని వ్రాసెను. ఆ సంఘమువారియొద్దగల వితంతు బాలికలలో నొక యమాయిక గలదు. ఆమెయు నియోగికుటుంబమున బుట్టినదియే. పేరు మంగమ్మ. రూపవంతురాలు. గుణవంతురాలనియు జెప్పవచ్చును. కాని పొత్తిగా నమాయకురాలగుటచే నెందఱో వరులు వచ్చియు, నామె పాణిని గ్రహించుటకు నిరాకరించిరి. ఆమె యా సంఘమువారియందజేరి యొక యేడాదియైనను, వరుడు దొరకకుండుటచేత నిర్వేదము వహింపవలసి వచ్చినది.

వెంకటరాజామెనుగూర్చి విని, యొకసారి కాకినాడకు బోయి, యామెను జూచి, సర్వవిధముల సంతుష్టి జెందెను. తెలివితక్కువ పిల్ల గావున, సంసారము పాడుచేయునేమోయని యించుక శంకించెను. కాని తన పేరు వెంకటరాజగుటయు, నామె పేరు మంగమ్మ యగుటయు తలచి తిరుమలవేంకటేశ్వర మంగదాయారమ్మలవలె దాముకూడ దాంపత్యసౌఖ్య మందవచ్చునని యూహించెను. ఎక్కువ తెలివిగలదియైన దనకొలది రాబడిని జూచియు దన యుత్తరవయస్సును మనస్సులో బెట్టుకొనియు దన్ను దిరస్కరింపవచ్చుననియు, గొంచెపు తెలివి గలదియే తన కమరుట మంచిదనియు దలపోసి మంగమ్మను బెండ్లియాడుట కియ్యకొనెను. మంగమ్మయు వెంకటరాజును బెండ్లాడ నిశ్చయించెను.

ఒక శుభదినమున వారికి బెండ్లియైనది. మంగమ్మను దీసికొని వెంకటరాజు గోపాలపట్టణము చేరెను. అది పల్లెటూరగుటచే నందలి జనులు పూర్వాచారపరాయణులై, యతనిని వెలివైచిరి. వెంకటరాజదియు దనకు మేలేయని యూహించెను. నూత్న దంపతులు సుఖముగా గాపురము చేయుచుండిరి. ఒండొరులు పేర్లతోనే పిలచుకొనుచు జనవుగానుండిరి.

ఒకనాడు వెంకటరాజు బడిని తనిఖీ చేయుటకు ఇన్స్పెక్టరుగారు వచ్చిరి. ఆయనతో దాను జాల తడవుండవలయును గావున, మధ్యాహ్నవేళ దా నిలు సేరునప్పటికి మిక్కిలి యాకలితో నుండవలసివచ్చునని తలచి, వెంకటరాజు భార్యతో "మంగా! నేను మూడుగంటల కింటికి వత్తును. అప్పటి కాఁకలితో నావురావురుమని వత్తును. కావున నింత మినుపరొట్టె చేసి, కొంచెము కాఫీ కాచుమీ" అని చెప్పెను. మంగమ్మ సరియేయనెను.

వెంకటరాజు నింట నొక పాఁడియావును, గావలికుక్కయు పెంపుడు పిల్లియు గలవు. ఆ యావుపాలు దంపతుల కిద్దరకు సరిపోవును. మంగమ్మకు వంటచేయుట తిన్నఁగా తెలియదు. పాఁడి చక్కగా జాగ్రత్తపఱచుకొన నేరదు. అయినను, వెంకటరా జెటులనో కాలక్షేపము చేయుచుండెను. భర్త యాజ్ఞనుబట్టి మంగమ్మ మినుపపప్పు రుబ్బి మూకుటరొట్టె చేయజొచ్చెను. రొట్టె పూర్తిగా గాలినతర్వాత బొయ్యిక్రింద మంటయార్పి, కాఫీకి పాలు లేవలెనని యింకొక గదిలోనికి బోయెను. పాలకుండమీద మూఁతవేయుట మఱచుటచే పెంపుడు బిల్లి పాలన్నియు ద్రావుచుండెను. కాని కొంచెము మిగిలియుండెను. అందు నెరసులు చాలగా బడుటచేత నొక్కొకటియే జాగ్రత్తగా దీయుచుండ, నొక యంశము జ్ఞప్తికి వచ్చెను. "ఆహా! మఱచితిని. కుక్కను గొలుసుతో గట్టివేయలేదు కాబోలు. అది రొట్టెముక్క నెత్తుకొనిపోవునేమో! ఈ నెరసులు తర్వాత దీయవచ్చును. ఈ

596

పాలను కుంపటిపై ముందుగా పెచ్చబెట్టెద" అని తనలో దాఁ బల్కికొని, ఉన్న కొంచెము పాలను కుంపటిమీద బెట్టి, రొట్టెముక్కకు దగ్గఱకు రాగా, నందు రొట్టె లేకుండెను. ఒకమూల నూర్చుండి కుక్క దానిని తినుచుండెను. దాని నోటినుండి లాగికొని, మిగిలినదైన బుచ్చుకొందమని యత్నించ, అది పాఱిపోయెను. దాని వెంబడి నామెయు బరుగెత్తెను. కాని లాభము లేకపోయెను. "పోయిన దానికై విచారించిన లాభములే" దనుకొనుచు నింటికి మరలెను. ఇంటికి వచ్చుసరికి కుంపటిమీది పాలుపొంగి, యింకను మిగిలియున్నవి మాడించిపోయెను. కాఫీ కషాయములో నించుక చక్కెఱ గలిపి యైన మగని కియ్యవచ్చునని, యొక గిన్నెతో వేడి కషాయము తయారుచేసి, దానిని ప్రొయ్యినుండి దింపలేక, క్రింద పడవైచెను. ఆ గదియంతయు కషాయముతో నిండిపోగా, భర్త జాడి యేమనునో యని యది పూడ్చుటకు నింట నిలువయున్న గోధుమపిండియంతయు దెచ్చి దానిపై జల్లెను.

వెంకటరా జింటికి నుస్సురనుచు వచ్చి, "మంగా! రొట్టెయు, కాఫీయు దెమ్మ" అనెను. ఆమె జరిగిన కథయంతయు జెప్పెను. "అయ్యో! ఎంత తెలివితక్కువదానవే! రొట్టె కుక్కకు బెట్టి, పాలు పిల్లికి బోసి, కాఫీకషాయము కాలదన్ని, గోనెడు గోధుమపిండియు గొంపనిండ జల్లితివే? ఇట్లు నీతో గాపురమున నాకేమి సుఖమే?" అని వెంకటరాజనెను. "నాకేమి తెలియును? మొదట నేను రాగానే నాకు మీరన్నియు జక్కగా బోధచేయరైతిరి! నాకేమి తెలియును?" అని మంగమ్మ మార్వలికెను.

పాలతి బుద్ధిహీనత కనిపెట్టి వెంకటరాజు తాను సంపాదించియున్న రెండు వందల రూపాయలు పెట్టెలోనుండగా, వానినిగూడ నామె పాడుచేయునేమోయని భయపడి, వానితో కాసులుకొని యా బంగారు కాసులనే తన కోటుబొత్తములుగా జేయించుకొని, ధరించి తిరుగజొచ్చెను. భార్య "యీ బంగారుబొత్తము లెక్కడివి"వని యొకనా డడుగగా, నాతడు "ఇవి బంగారపువి కావు. ఇత్తడివి. చాల చౌకగా గొంటిని. వీనిపై నాకు మచ్చట గలదు గావున, నీవు ముట్టకు"మని చెప్పెను. మంగమ్మ ముట్టనని యొట్టుపెట్టుకొనెను.

ఒకనాడు పింగాణీ గిన్నెలు, పళ్లెములు నమ్ము వర్తకులు కొంద ఱావీధిని వచ్చిరి. వానిపై చిత్రవర్ణములు వేయబడియుండుటచే నవి మంగమ్మ కన్ను గుట్టినవి. ఆ వర్తకుల బిలిచి వాని వెల యడిగినది. వారు కొన్ని రూపాయల వెల చెప్పగా, "అయ్యా! నా భర్తగారింట లేరు. నాయొద్ద డబ్బు లేదు. నాకు గావలసిన సరకులిచ్చి, సొమ్మునకు మరల వత్తురా?" యని యడిగెను. వారు వీలులే దనిరి. "మాయింట నే ధనమును లేదు. నా భర్తగారి కోటునకున్న యిత్తడిబొత్తాలు మాత్రమున్నవి. అవి వలయునేని పుచ్చుకొని, నాకు గొన్ని సరకు లిండు" అని యామె యడిగినది. ఆమె యమాత్రము, వైఖరియుఁ గనిపెట్టి, వర్తకు లామె మూర్ఖయని గ్రహించి, "సరే, ఏవి యా బొత్తా"లని యడిగిరి. మంగమ్మ, "నేను వానిని ముట్టనని వాగ్దానముచేసితిని. మీకు బనికివచ్చునేని, మీరే తీసికొనుడు" అని భర్త గదిలోనికి వారిని దీసికొనిపోయి బొత్తాలు చూపెను. వారు సంతసముతో వానిని గ్రహించి, తమ కావడిలోని గిన్నెలును, పళ్లెములు, నన్నియు నిచ్చి చనిరి. మంగమ్మ పరమానందముతో వాని నిల్లంతయు బఱచియుంచెను.

వెంకటరాజు కొంచెము సేపటికే యింటికి వచ్చెను. వచ్చుసరికి యిల్లంతయు బింగాణి వస్తువులతో నిండియుండెను. "ఇవెక్కడినుండి వచ్చిన"వని యాతడు భార్య నడుగగా, నామె "మీ యిత్తడిబొత్తాలిచ్చి యిన్ని సరకులు కొంటిని. ఇది మంచి బేరము కాదా?" యనెను. "ఒసీ, నీ యిల్లు నల్లకాదు గాను. నా కొంపదీసితివే! నీవు తెలివి తక్కువ ముండవనియు, వానిని పాడు సేయుదువని యు భయపడి, యవి యిత్తడివంటిని. కాని బంగారువే. నాకున్న ధనమే యది. అది దొంగలపాలు చేసితివే! నిన్ను పెండ్లాడినందునకు జాల సుఖపెట్టుచుంటివే!" యనెను. మంగమ్మ, "నన్నేమి చేయుమందురు? నాకేమి తెలియును? నాతో నిత్తడి యనుటచే నట్లు చేసితి. అదిగాక నేను వానిని ముట్టలేదు. ఆ వర్తకులే తీసికొనిరి" అని మార్వలికెను.

"సరే, ఇప్పుడు నా కేమార్గము వలయు"నని యతడడిగెను. "వా రా కొండవైపునకే పోయిరి. మనము పరుగెత్తి పోయిన దొరకుదురు" అని మంగమ్మ యనెను. "కానిమ్ము. పరుగెత్తడము గాక!

కాని నాకడుపులో దహించుకొనిపోవుచున్నది. నేను రొట్టెలవానియొద్ద గొన్న రొట్టె సగమున్నది. అదియు, మన యావువెన్నయు బట్టుకొనిరమ్ము. దొంగల బట్టుకొన్న తర్వాత వానిని దినెదను" అని యుగ్గడించెను.

ఆమె, భర్త కోరిన వస్తువులతో, నాతని వెంబడి బయలుదేరెను. భర్త చివచివ నడచుటచే, భార్య వెనుకబడిపోయెను. అతడు వేగముగా గొండ నెక్కి తొచ్చెను. "నా మగడు ముందువెళ్లి దొంగలను బట్టుకొని మరలి వచ్చునప్పటికి, నే నింకను సగము దూరములో నేయుందును కాబోలు. పోనిమ్ము. నాకే మంచిది. కొంత నడకతప్పినది. ఆయాసము కలుగదు" అని మంగమ్మ తనలో దానె బల్కికొనుచు మెల్లగా నడచుచుండగా, దారిలో పశువులు చెట్లను రాపిడిపెట్టి వీపులను గోకికొనుట గాంచెను. ఆ రాపిడిచేత, నా చెట్లబట్ట లూడుచుండెను. "పాప మీ చెట్లకు చర్మమూడి యెంత బాధ కలుగుచుండెనో! వీని కెవ్వరుదిక్కు? మనకు గాయములైన వైద్యులుందురు. వీని కెవ్వరుదిక్కు? వెన్న పుండ్లకు బట్టించిన గాయము కుదురునందురు. ఈ చెట్ల కీవెన్న రాచెదను" అని యామె చెట్లయందనుకంపవహించి యా వెన్నయంతయు నచ్చటి చెట్లకు బూసెను. తర్వాత మెల్లగా నామె కొండ యెక్కుచుండగా, రొట్టెముక్కలలో నొకటి క్రిందబడి దొరలిపోయెను. దానికై తాను పోలేక, "అది యెక్కడనున్నదో మన కెట్లు తెలియగలదు? రొట్టెను వెదకుటకు రొట్టెయే సమర్థురాలు. కావున, ఈ రెండవ ముక్కను బంపెద. ఇది మొదటిదానిం గని మేము మరలి వచ్చునరికి బట్టియుంచు"నని రెండవ ముక్కనుగూడ దిగవిడిచెను.

ఈరీతిగా వట్టిచేతులతో నామె భర్తను గలిసికొని జరిగిన యుదంతమెల్ల నెఱింగించెను. అతడిట్టి మూర్ఖురాలిని గట్టికొన్నందునకు గడుదుఃఖించి, "ఓసీ, వీనియున్నిటి మాటకేమి! వచ్చునప్పుడు వీధితలుపు జాగ్రత్తపఱచివచ్చితివా, లేదా" యని యడిగెను. లేదని యామె బదులుచెప్ప, "ఓసీ నిర్భాగ్యురాలా! యింకను నింటగల యుపకరణములెల్ల దొంగలకు జెట్టవలయుననియా తలుపు భద్రముచేయక వచ్చితివి? వెనుకకేగి దానిని భద్రముచేసి రమ్ము" అనిపంపెను. "వచ్చునప్పుడు గూటిలోనున్న బాదము కాయలను, ఒక గిన్నెతో గొంచెము మజ్జిగయు దెమ్ము. చాల ప్రొద్దుపోయినది" అనియు భార్యతో జెప్పెను. ఆమె మగని యాజ్ఞప్రకారము వెన్కకేగి, దొడ్డితలుపునకు తాళము వైచి, వీధితలుపు పైకెత్తి, యదియు, నొక గిన్నెతో మజ్జిగయు, నొక బుట్టలో బాదముకాయలును బట్టుకొనివచ్చెను. భర్త కొయ్యబడిపోయెను. "ఓసీ మందమతిముండదా! వీధితలుపు గూడ తీసికొనివచ్చితివా! దొంగలకు మఱియు వీలు గలుగవలయుననియా? అప్పుడే చీకటిపడినది. ఇప్పుడీ కొండ దిగుదుమేని, యే పాపమో కలుగవచ్చును. నీ జీవముల కేడ్చుచు, నేటిరేయి చెట్టుకొమ్మలపై దాగుకొనియుందము. రమ్ము" అని సమీపమందలి బాదము చెట్టుమీది కెక్కెను. ఆమెయు వలతి బరువుతో నొక కొమ్మపైకెక్కి కూరుచుండెను.

బంగారు బొత్తాలు దొంగిలించిన దొంగలును, ఆ చెట్టుక్రిందికే చేరుకొనిరి. వారాడుమాటలవలన, వారే తన సొత్తు దొంగిలినవారని యా దంపతులు గ్రహించి, కిమ్మనక యూరకుండిరి. మంగమ్మకు బరువు మిక్కుటముగా దోపగా, "ఏమండీ! ఈ బాదముకాయల మూటవలన బరువెక్కువగానుండి మోపలేకున్నాను. వీనిని దిగవిడిచెద" ననెను. భర్త "వలదు. అనుమానహేతువగును. మనల వారు పట్టుకొందురు. లేక పాఱిపోవుదు" రన్నను వినక, కాయల విడిచిపెట్టెను. అవి చెట్టునుండి రాలిన కాయలని దొంగలు తలచిరి. ఇంకను నామెకు బరువు తగ్గదయ్యె. ఈమాఱు మజ్జిగ నొలుకబోయుదు ననెను; భర్త వలదన్నను వినక యదియు నొలుకబోసెను. దొంగ లది మంచో, పిట్టల మూత్రమో యని తలచి యూరకుండిరి. ఆవల నింకను బరువటులే యుండ నామె తలుపుకూడ గూలద్రోసెను. అది మీదఁబడ చెట్టుపై నేదియో దయ్యమున్నదనుకొని, వారు ధన మచ్చటవిడిచి కాలికిబుద్ధి చెప్పిరి. తెల్లవాఱిన తర్వాత, దంపతులు చెట్టుదిగి చూచుకొనఁగా దమ బంగారు దొరకినది.

మంగమ్మ మందమతి యిదివఱ కుపకరింపకున్నను, ఇప్పుడైన నుపకరించెను. ఎక్కువ మూర్ఖతగలవారి మూర్ఖత్వ మొక్కొకతఱి నుపకార మొనరింపవచ్చును. కాని వెంకటరాజు తద్దినము కొనితెచ్చుకొన్నట్లు, తెచ్చుకొన్న యీ రెండవభార్యవలన మరల జీవితకాలములో సౌఖ్యము పొందలేకపోయెను.